





# ★ "కలలోని కలత" ★

— రచన : కేశరాజు సోమేశ్వరరావు —

రైలుస్టేషనులో మ్రోగిన గంట విని రాజు రెస్టారెంట్ బయటకు వచ్చాడు. స్టేషను విద్యుద్దీపాలకాంతిలో సుందరంగా ఉంది. మూడవ తరగతి వెయిటింగ్ హాలులో ప్రయాణీకుల సందడి ప్రతిధ్వనిస్తూంది. సిగిరెట్ పొగవదుల్తూ ప్లాట్‌ఫాంలో ప్రవేశించాడు రాజు.

రైలు గంటలేటని స్టేషనుమాష్టరు నోటీసు బోర్డుపైన వ్రాసి వెళ్లాడు. హడావుడిగా తిరిగే ప్రయాణీకులు ఒక్కొక్కరే తమ తమ సామాన్లవద్ద కూర్చుని జోగసాగారు. రోజంతా ఆఫీసుపనిలో అలసిపోయిన రాజుకు చెట్ల నుండి వీచే చల్లటిగాలి హాయి కల్గించింది. ఆవిలింతలు బయల్దేరాయి, కనురెప్పలు బరువుగా వాలిపోతున్నాయి. నిద్రముంచుకు వస్తోంది. ప్రక్కనే ఉన్న సిమెంటు బెంచీపై జార్లబడి బద్ధకంగా కళ్లు మూసుకున్నాడు. ప్రక్కనున్న ప్రయాణీకుడు లేచిపోగా కాళ్లు చాచి ఒరగిల పడుకున్నాడు.

ప్రయాణీకులు ప్లాట్‌ఫారం నుంచి తొంగి తొంగి రెండు వైపులా చూస్తున్నారు. ఇంతలో సిగ్నలు రెక్క వాలింది. జనం నలుమూలలా కలకచారారు. పోర్టర్లు సామాన్లను మోసుకు వస్తున్నారు. పసిపిల్లల్ని తల్లులు చంకల్లోకి తీసికొని పాలు పట్టిస్తున్నారు. జేబుల్లో టిక్కెట్లున్నాయో లేదో చూచుకుంటూ కొందరు పంట్లాములు తడుముకుంటున్నారు. ఒకటి, రెండు....అని సామాన్లను లెక్క పెడుతోంది ఓ ముసలమ్మ.

రైలు ఇంజను రాకసిలా గర్జించి నెమ్మదిగా, భయంగా స్టేషనులోంచి ముందుకుపోయి నిలచింది. పెట్టెల్లోంచి తలలు బయటపెట్టి బయటప్లాట్‌ఫారంలోనిరద్దీనిగమనిస్తూ, సాతుకుడు, కమాలాఫలాలను బేరంచేస్తూ చేతిలోని పావలా కాసు ప్లాట్‌ఫారానికి రైలుపెట్టెకీ మధ్య గల సందులో పారేసి బిక్కమొగం పెట్టింది ఒక నడివయస్సు గృహిణి. సామాన్లను వేగించుకుంటూ దగ్గిరున్న రద్దీగానున్న పెట్టెల్లోనే ఎక్కాలని ప్రయత్నిస్తున్నారు కొందరు. హైహీల్సు జోడు తొడుక్కున్న అమ్మాయి తొందరలో షిఫాన్ చీరపైట జారిపోగా సర్దుకోబోయేటంతలో కాలు తడబడి చతికిలబడింది. కిలకిల మంటూ ఆమె చూసి నవ్వుతూ ఇద్దరు కాలేజీ యువకులు వెనుకనున్న ఓ బిచ్చగత్తె మీదపడి పైగా ఆమెను అసహ్యించుకొంటున్నారు. మొరటుగా ఎక్కే గుంపును తోసుకుంటూ, వాళ్లమధ్య నలిగి వాడిపోయిన మల్లెపూవులా శ్రీదేవి చిన్న హేండ్‌బాగ్‌తో దిగింది.

ప్లాట్‌ఫారంపై తిరుగుతున్న రాజుకు ఆమెను చూడగానే ఎవరో ఆత్మీయురాలుగా అనిపించింది. ఎక్కడ చూచాను చెప్మా ఈవిడ్ని అనుకున్నాడు. ఎంత ఆలోచించినా అతని మస్తిష్కంలో ఏమీ గోచరించలేదు. ఆమె మరింత దగ్గరగా నిల్చుంది. ఎలెక్ట్రిక్ లైటు కాంతిలో ఆమె ముఖం వింత అందంతో వినూత్నంగా మెరిసి పోతోంది. బత్తాయి తొనల్లాంటి పెదవులు, పెదవులపైగా చిన్న ముక్కు, ముక్కుకుపైగా రెండు వైపులా అరసున్నల్లాంటి కనుబొమలూ వానిలో అర్ధనిమీలితాలయిన కండ్లు. ఆమె బాగా తెలిసిందేనని రుజూ పర్చాయి. కాని ఎవరీమె?

అకస్మాత్తుగా అతని దృష్టి బత్తాయి తొనల్లాంటి పెదవుల క్రిందుగా గడ్డంలోనున్న సొట్టలో స్పష్టంగా కనబడుతున్న కందిగింజంత పుట్టుమచ్చపై పడింది. నిశ్చయంగా ఆమె తను బాగా ఎరిగున్నదే. తీవ్రంగా ఆలోచించాడు. అతని ముఖం వికసించింది.

"శ్రీదేవి" దాదాపు గట్టిగా అరిచేసాడు. "నేను రాజును. నీ బాల్యస్నేహితుణ్ణి. అంతా క్షేమమేనా ఎక్కడ నుండి రావడం. నెల్లూరి నుంచేనా" సంతోషంతో అతని శరీరం ఊగిపోతోంది క్వశ్చన్ మార్కులా ఉన్న ఆమె ముఖంకేసి చూసి మరింత దగ్గరగా వెళ్తూ "గుర్తుపట్టలేక పోతున్నావా, చిన్నప్పటి స్నేహితుడింకా జ్ఞాపకముంటాడా నీకు. ఎప్పుడు పెద్ద మేష్టారుగారిల్లు వదలిపెట్టేవో అప్పుడే నన్ను మరిచిపోయావు!" అన్నాడు.

ఆమె అతని వింత ధోరణికి ఉలిక్కిపడి చూసింది. కనుబొమలు గిర్రుని తిరిగి యధా ప్రకారంగా వచ్చాయి. నఖశిఖ పర్యంతం ఎగాదిగా చూసి "నీవెవరో నాకు తెలియదే" అన్నట్లు ముఖం పెట్టింది.

ప్రక్కకు తిరిగిన ఆమె ముఖం సినిమాలో సైడ్ పోజిచ్చిన సావిత్రిలా అందంగా ఉంది. మధ్యగా మూడం కెలాగున్న చెవిచుట్టూ రేగిన వెంట్రుకలు గాలికి కొట్టుకుంటున్నాయి. రాజుగుండెల్లో ఏ మూలైనా కాస్త అనుమానముంటే ఈ దెబ్బతో అది గూడా పారిపోయింది "అదేమిటి శ్రీదేవి ఎరగని వారిని చూసినట్లు చూస్తావ్. అప్పుడే నేను కొత్తవాణ్ణి అయిపోయానన్నమాట. ఐదేళ్లు గడిచాయో లేదో, ఎంతటి ఆత్మీయుల నయినా ఆడవాళ్లు అతిత్వరలో మరచిపోతారనే పెద్దవాళ్ళ మాటను నిజం చేసావు. అయినా నా పిచ్చిగాని చిన్నప్పుడు తాయిలంకోసం చుట్టూ తిరిగి ఏడిచే శ్రీదేవికి, చెవులునులిమే ఈ రాజెందుకు జ్ఞాపకముంటా డిప్పుడు. రోజులు మారాయి, మనసులు మారాయి:........"ఇంకా ఏదో చెప్పబోతూ రాజు ఆమె ముఖంకేసి చూసాడు.

రంగులు మారిన ఆమెకేసి చూసి రాజు రెండడుగులు వెనక్కి వేసాడు. ఇంతలో ఆమె రిక్షావాణ్ణి పిలిచింది.

తడబడుతూ రాజు "రిక్షా ఎందుకు దేవీ, నేనిక్కడే ఎల్. ఐ. సి. లో పని జేస్తున్నాను.

ప్రక్క వీధిలోనే మన యిల్లు. ఈ మధ్యనే అమ్మమ్మను గూడా తీసుకువచ్చాను. పద పోదాం" అన్నాడు.

ఆమె రాజువైపు కోపంగా చూసి ముందుకు నడిచింది. "చాలించు నీ అనవసర ప్రసంగం" అన్నట్లుగా ఉందా చూపు.

రాజు గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. ఏమిటీ విపరీతం. నేనేం భ్రమపడలేదు గదా! గడ్డంలో సొట్ట. సొట్టలో కందిగింజంత పుట్టు మచ్చ చిన్నప్పటినుంచి పన్నెండేళ్ల దాకా నాతో ఆడుకున్న శ్రీదేవేనా ఈమె. ఎంతలో ఎంతగా మారిపోయింది.

ఆమె స్టేషను చివరకు నడిచింది. అప్రయత్నంగా రాజు ఆమెను వెంబడించాడు. ఆమెను వదలడానికి వీల్లేదు. రెండు రోజుల క్రితమే వాళ్ళన్నయ్యా ఉత్తరం వ్రాసాడయ్యో ఆమె మెడిసిన్‌లో చేరేందుకు వస్తోంది. స్టేషనుకు వచ్చి తీసుకెళ్లవలసిందని ఆమెతో వచ్చేందుకు తనకు సెలవు దొరకలేదని, తన్ను కాస్త వీలుకల్గించుకొని ఆమెకు సహాయం చేయవలసిందని, క్రొత్త ఫూల్లో ఆమెకు ఏమీ తెలియవని, మరీ మరీ వ్రాసాడు కూడా. ఆయినా శ్రీదేవి తన్ను గానట్లు, తెలియనట్లు ఎందుకు నటిస్తోంది చెప్మా! రాజు ముందు పోతున్న ఆమెను మళ్లీ పిల్చాడు.

"శ్రీదేవి" ఆమె వెనక్కి తిరిగింది. నిప్పులు చెరుగుతోంది ఆమె ముఖం. కోపంగా "ఏయ్ మిస్టర్, నీవెవరో నాకు తెలియదు. నా పేరు శ్రీదేవి కాదు బానకి. నేను పుట్టిన తరువాత నిన్ను ఇంతవరకూ చూడలేదు. ఎవరో అనుకుని ఎందుకు నా వెంట పడతావ్. పిచ్చి పిచ్చి వేషాలెయ్యక వెళ్లిపో" అంది.

ఇంతలో రిక్షావాడు "ఏంటయ్యా ఒంటరిగా చూసి అమ్మగారి మీదమీదకు వస్తున్నావ్. జాగ్రత్త ఎముక లిరిగేను" అన్నాడు. వాడి కేకలకు ప్లాట్‌ఫారం మీద ఉన్న నలుగురూ పోగయ్యారు. రైలుబండి తన విధ్యుక్త ధర్మ నిర్వహణలో లీనమై గట్టిగా కూతవేసి భారంగా కదిలింది.

"ఒంటిగా ఆడమనిషి కనిపిస్తేనరి వళ్లు తెలియదు యీ జల్సారాయుళ్లకు. వయస్సు వచ్చినకొద్దీ కాస్త జాగ్రత్తగా మసులుకోవాలి" అంటున్న పెద్ద మనిషిని త్రోసుకుంటూ స్టేషనుమాస్టరు పరుగెత్తుకొని వచ్చాడు. "ఏమి టేమిటని?"

గుంపులో ఎవరో "జేబులు జాగ్రత్త," అన్నారు.

"మెడలోని రాళ్లనెక్లెస్ దొంగిలించడానికి వేసిన ఎత్తు. ఆమె దగ్గిర వాడి ఎత్తులేవీ సాగలేదు. దొంగవెధవ," తమ అభిప్రాయాన్ని గాలికి వదిలేసారు మరొకరు. రాజు గుండె ఆగిపోయినంత పనయింది. దొంగలంటే ఇలాగే పొడుగులాగు, తొడుగుకుంటారు కామోసు. అనుకుంది తండ్రి చెయ్యి పట్టుకొని వేడుక చూస్తు ఓ పదేళ్ల అమ్మాయి.

"ఎవరు నువ్వు. ఆమెతో నీకేం పని....రా స్టేనులోకి" అంటూ రైల్వేపోలీసు ఒకడు రాజుజెబ్బ పుచ్చుకొని విసురుగా లాగాడు. ఆ ఊపుకు ముందుకు పడబోయి తమాయించుకొని "నేనండి సుందరాచారిగారి అబ్బాయిని. నా పేరు రాజు" అంటున్నాడు రాజు.

"అక్కడ చెప్పుకుందువుగాని పద ముందుకు"లాగాడు పోలీసు. నిరాశగా రాజు ఆమె మొహంవంక చూసాడు. అసహ్యంతో అష్టవంకరలు తిరిగి 'తూ' అని ఉమ్మేసినట్లుగా ఆమె మొహం పెట్టింది. "ఇంకా కదలవేం" అంటూ తలమీద పడ్డ బరువైన దెబ్బకు రాజు 'అమ్మా' అని అరిచాడు.

నిద్రలో బెంచిమీద నుంచి క్రిందపడ్డ రాజుకు స్వప్నభంగ మయింది. రైలు స్టేషనులో అప్పుడే కాలు బెడుతూంది. ప్రయాణీకులంతా తొందరపడుతున్నారు. తనకు వచ్చిన కలను మరచిపోలేక నెమ్మదిగా లేచి గేటువైపు నడిచాడు రాజు.

ఈ రోజు ఆమె వస్తుందని వాళ్లన్నయ్యా వ్రాసిన ఉత్తరం జేబులోనే ఉంది. దానిని చూచి ఒక నిట్టూర్పు విడిచాడు.

శ్రీదేవి పెట్టె దిగి వస్తోంది. ఆమె సందేహం లేదు. అర్ధనిమీలితాలయిన కళ్లు, గెడ్డం క్రింద సొట్ట, సొట్టలో కందిగింజంత పుట్టుమచ్చ. అబ్బ ఎంత అందంగా ఉంది. రాజు కళ్లు ఆమెను చూడగానే సంతోషంతో మెరిసాయి.

ఆమెను సమీపించి మనస్సు జంకుతోంది. స్వప్నం వెనక్కు లాగుతోంది కాని ముందుకు నడిచాడు ఆమెను చూస్తూ నిలబడ్డాడు. పలుకరించబోయాడు కాని మాటలు పెగల్లేదు. తన కెదురుగా నిల్చున్న రాజును అలోచనతో భ్రుకుటి ముడివేసి చూసిందామె. కాసేపటికి ఆమె ముఖం వికసించింది.

"హల్లో రాజూ, ఎంత కాలానికి కనబడ్డావ్. అయితే మా అన్నయ్యా వ్రాసిన ఉత్తరం అందిందన్నమాట. అలా మూగనోముపట్టావేం. నన్ను గుర్తుపట్టలేదా, నీ చిన్నప్పటి శ్రీదేవిని" అంది.

కలలోని శ్రీదేవిని వదలి రైలు దిగిన ఈ దేవిని పలుకరించేందుకు రాజుకు అప్పటికి గాని ధైర్యం చాల లేదు. బెదురు వదిలినా తడబడే గొంతు సవరించుకుంటూ ముసి ముసి నవ్వులు నవ్వాడు రాజు. *



జగపతి పిక్చర్సువారి "అన్నపూర్ణ"లో జమున జగన్మోహినిలా పూతోటలోచేరి కోకిలాగానం ఆలాపిస్తోంది ఎవరికోసమో మరి!